ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news


హైదరాబాద్
8-12-2025
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 96

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news


# త్వరలోనే విశాఖలో ఆధునిక సైక్లింగ్ ట్రాక్‌లు



- విశాఖలో ఫుట్‌పాత్‌లు, పచ్చదనంపై ఓ సంస్థ ప్రశంసలు
- బెంగళూరుతో పోలుస్తూ వైజాగ్‌ను కొనియాడిన సంస్థ
- నగరంలో సైక్లింగ్ లేన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- ట్వీట్‌కు సానుకూలంగా స్పందించిన సీఎం

2లో



## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు

# సర్వం సిద్ధం

- అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్వహణకు పూర్తయిన ఏర్పాట్లు
- భారీగా పెట్టుబడులకు ఆహ్వానం, ప్రభుత్వ సహకారంపై చర్చ
- హాజరుకానున్న 44కు పైగా దేశాల ప్రతినిధులు
- రేపు మధ్నాహ్నం సదస్సును ప్రారంభించనున్న గవర్నర్

తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్ కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్ లో పాల్గొంటున్నారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు తరలివస్తున్నారు.

- మిగతా 2వ పేజీలో

## గోవాలోని నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం..

# 25 మంది మృతి




- బిర్చ్ నైట్‌క్లబ్ లో అర్ధరాత్రి అగ్నికీలలు
- బాణసంచా పేలుడుతో క్షణాల్లో వ్యాపించిన మంటలు
- ఇరుకుదారిలో బయటకు వెళ్లలేకపోయిన బాధితులు
- బేస్‌మెంట్‌లో చిక్కుకుని ఊపిరాడక పలువురి మృతి
- మృతుల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బంది
- 7 మృతదేహాల్ని గుర్తించాల్సి ఉందన్న గోవా పోలీసులు
- క్లబ్ యజమానులు, మేనేజర్‌పై క్రిమినల్ కేసు నమోదు



## డిసెంబరు 9న 'విజయ్ దివస్'...

- రాష్ట్రవ్యాప్త సంబరాలకు పిలుపునిచ్చిన కేటీఆర్
- కేసీఆర్ దీక్ష ఫలితంగా వచ్చిన విజయాన్ని స్మరించుకోవాలని కేటీఆర్ సూచన
- ప్రతి నియోజకవర్గంలో సంబరాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆదేశం
- వేడుకల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్న బీఆర్ఎస్

2లో



9లో

## కేసీఆర్ పోయి రేవంత్ వచ్చారంతే...

# అందులో మాత్రం మార్పేమీ లేదు

- ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలేనన్న కిషన్ రెడ్డి
- హామీల అమలుపై చర్చకు రావాలంటూ సీఎం రేవంత్‌కు సవాల్
- నిరుద్యోగ భృతి, పెన్షన్ల పెంపు ఏమైందని నిలదీత
- కేసీఆర్ పోయి రేవంత్ వచ్చినా, పాలనలో మార్పు లేదని విమర్శ

# ఆదివారం 650 సర్వీసులు రద్దు చేసిన ఇండిగో

- విమానాశ్రయాల్లోనే వేలాది మంది పడిగాపులు
- సంక్షోభాన్ని సరిదిద్దేందుకు కమిటీ ఏర్పాటు చేశాం
- ఆదివారం ఉదయానికల్లా 610 కోట్లు రిఫండ్ చేశాం
- పదో తేదీకల్లా అన్ని సర్వీసులు నడుపుతాం: ఇండిగో
- కేంద్ర విధానాల ఫలితమే ఇండిగో సంక్షోభం: కాంగ్రెస్
- ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దు: రామ్మోహన్






## మా కుటుంబానికి ప్రవాసాంధ్రులు కొండంత బలం..

# గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం!

- ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రవాసాంధ్రులు అండగా నిలిచారు
- మా కుటుంబానికి ప్రవాసాంధ్రులు కొండంత బలం
- 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

# డిసెంబరు 9న 'విజయ్ దివస్'...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వెలువడిన చారిత్రక దినమైన డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా 'విజయ్ దివస్' వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష ఫలించిన రోజును పండుగలా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నాయకులతో సమావేశమైన కేటీఆర్, ప్రతి నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీ స్థాయిలో సంబరాలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో డిసెంబర్ 9 ఒక మైలురాయి అని, ఆ రోజును ప్రజలందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ 2009 నవంబర్ 29న నిరాహార దీక్ష ప్రారంభించగా, తీవ్రమైన ఉద్యమ ఒత్తిడి నేపథ్యంలో 10 రోజుల తర్వాత డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ చారిత్రక నేపథ్యాన్ని స్మరించుకుంటూ వేడుకలు జరపాలని కేటీఆర్ తెలిపారు. "తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం చేసిన పోరాట ఫలితాలు మనకు గర్వకారణం. దీక్ష ద్వారా సాధించిన విజయాన్ని జరుపుకుందాం" అని ఆయన అన్నారు. ఈ వేడుకల నిర్వహణ కోసం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తోంది. పార్టీ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

# మా కుటుంబానికి ప్రవాసాంధ్రులు కొండంత బలం.. గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం!

ప్రతిపక్షంలో ఉన్నపుడు కూడా ప్రవాసాంధ్రులు తమకు అండగా నిలిచారని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తమ కుటుంబానికి ప్రవాసాంధ్రులు కొండంత బలం అని, వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామన్నారు. తెలుగువాళ్లు దశాబ్దాల క్రితమే అమెరికాకు వచ్చారని పేరొన్నారు. విదేశాల్లో ఉన్న తెలుగు వారికి ఏ కష్టం వచ్చినా ఏపీ ఎన్ఆర్టీ అండగా ఉంటుందని చెప్పారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని నారా లోకేష్ చెప్పుకొచ్చారు. డాలస్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో నారా లోకేష్ పాల్గొన్నారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం. మా కుటుంబానికి మీరు కొండంత బలం ఇచ్చారు. స్పీడ్‌కు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వారు వై నాట్ 175 అంటే.. ప్రజలే వై నాట్ 11 అని అన్నారు. ప్రవాసాంధ్రుల మద్దతుతో కూటమి సూపర్ హిట్ అయ్యింది, వైసీపీ 11కి ఆలౌట్ అయింది. అమెరికాలో తెలుగు వాళ్లు సత్తా చాటారు. కష్ట కాలంలో మీరంతా మా కుటుంబానికి అండగా నిలిచారు. విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఏ కష్టం వచ్చినా ఏపీ ఎన్ఆర్టీ అండగా ఉంటుంది' అని మంత్రి నారా లోకేష్ అన్నారు. 'విడాకులు, క్రాస్ ఫైర్‌లు, మిస్ ఫైర్‌లు లేకుండా మరో 15 ఏళ్లు ఎన్డీయే కూటమి రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టం. మేం కక్షసాధింపులకు పాల్పడటం లేదు. సీఎం చంద్రబాబుని 53 రోజులు పాటు జైలులో ఉంచినపుడు ప్రవాసాంధ్రులు మాకు అండగా నిలిచారు. 2019-2024 మధ్య ఎంతటి విధ్వంస పాలన జరిగిందో అందరికీ తెలుసు. అందుకే సిద్ధం అంటూ వచ్చిన పార్టీని ప్రజలు భూస్థాపితం చేశారు. రాబోయే రోజుల్లో రికార్డులు తిరగరాస్తాం. దేశంలో పలు రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌లు ఉంటే.. ఏపీలోనే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది'

# సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన

హైదరాబాద్: రాష్ట్రంలోని ఏ వర్గాన్నీ విస్మరించకుండా అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యమిస్తున్నామని, ఎన్ని కల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ పాలన నిలుస్తోందని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయి మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. రెండేళ్ల కాలం తక్కువే అయినా ప్రభుత్వం సాధించిన విజయాలు అత్యద్భుతం. ధనిక రాష్ట్రాన్ని తమ స్వార్థపూరిత నిర్ణయాలతో పదేళ్లలో దివాలా తీయించి, ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని మాకు అప్పగి స్తే రెండేళ్లలోనే సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం. ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం. ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశాం. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది'అని అన్నారు. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మో డల్‌గా నిలబెట్టామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రా ష్ట్రంలో భూ సమస్యలను వీలైనంతవరకు తగ్గించడం, అర్హు లందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం తమ ప్రభుత్వం ముందున్న ప్రథమ లక్ష్యమని మంత్రి పొంగులేటి వెల్లడించారు.



# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు సర్వం సిద్ధం

నేటి మధ్నాహ్నం ఒకటిన్నరకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా సమ్మిట్ ను ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభవేడుకకు హాజరవుతున్నారు. సమ్మిట్ లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా-టెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్-షా, తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వంవైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహుతులకు వివరిస్తారు. రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఇందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. వచ్చిన అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధంచేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక



టెక్నాలజీ తో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, 3%ణ% ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్ లో ఎల్ఈడీ స్క్రీన్స్ తో ఈ విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజుల పాటు హాజరైన అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. ఇక అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్ లో పొందుపరుస్తారు. అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, బాదం కీ జాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేక బాస్కెట్ ను కూడా అతిథులకు అందించనున్నారు.

# ఆదివారం 650 సర్వీసులు రద్దు చేసిన ఇండిగో

న్యూఢిల్లీ/ముంబై, డిసెంబరు 7: దేశంలో విమానయాన సంక్షోభం కొనసాగుతోంది. పెద్ద సంఖ్యలో ఇండిగో విమానాల రద్దు, విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికుల పడిగాపులు కొనసాగుతున్నాయి. ఆదివారం దేశవ్యాప్తంగా 650 ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. అందులో శంషాబాద్ నుంచి 115 సర్వీసులు, బెంగళూరు నుంచి 150, ఢిల్లీ నుంచి 108 సర్వీసులు ఉండటం గమనార్హం. అయితే పరిస్థితిని సరిదిద్దుతున్నామని, బుధవారం నాటికి దాదాపు అన్ని సర్వీసులను పునరుద్ధరిస్తామని ఇండిగో ప్రకటించింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్య విధానాల ఫలితమే ఇండిగో సంక్షోభమని కాంగ్రెస్ ఆరోపించింది. విమాన చార్జీలపై నియంత్రణలు కొనసాగించాలని డిమాండ్ చేసింది. ఇండిగో సంక్షోభంతో లక్షలాది మంది ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడటం, ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. డీజీసీఏ ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) ఇసిడ్రో పోర్కెర్‌సలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. భారీగా విమానాల రద్దుపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా ఇండిగోపై చర్యలు చేపడతామని వెల్లడించింది. ఇక జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని రవాణా, పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం.. విమానయాన సంక్షోభంపై దృష్టిపెట్టినట్టు తెలిసింది. ప్రైవేటు విమానయాన సంస్థలు, డీజీసీఏ ఉన్నతాధికారులను పిలిపించి వివరణ కోరనున్నట్టు సమాచారం. ఇండిగో విమాన సర్వీసుల పరిస్థితి మెరుగుపడుతోంది. మొత్తం 2,300 సర్వీసులకుగాను ఆదివారం దేశవ్యాప్తంగా 1,650 సర్వీసులను నిర్వహించామని, 650 విమానాలు రద్దయ్యాయని ఇండిగో ప్రకటించింది. క్రమక్రమంగా అన్నింటినీ మెరుగుపరుస్తూ వస్తున్నామని, బుధవారానికల్లా పూర్తిస్థాయి సర్వీసులు నిర్వహిస్తామని తెలిపింది. మొత్తం 138 ప్రాంతాలకుగాను 135 ప్రాంతాలకు సర్వీసులను పునరుద్ధరించినట్టు వివరించింది. విమానాల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందిపడకుండా వీలైనంత ముందుగానే సమాచారం ఇస్తున్నామని పేర్కొంది. విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం 'సంక్షోభ నిర్వహణ కమిటీ'ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించింది. రద్దయిన విమానాలకు సంబంధించి ప్రయాణికుల సొమ్మును వేగంగా తిరిగిస్తున్నామని, ఆదివారం ఉదయానికల్లా రూ.610 కోట్ల రీఫండ్లు చెల్లించామని తెలిపింది. ప్రయాణికులకు సంబంధించిన 3 వేల బ్యాగులను వారికి అందజేశామని వెల్లడించింది. కాగా, ఇండిగో విమానాల రద్దు కారణంగా.. ఎయిరిండియా నుంచి కనెక్టింగ్ విమాన టికెట్లు, రిటర్న్ టికెట్లు ఉన్నవారు వాటిని రద్దు చేసుకుని తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో దేశీయ ప్రయాణికులకు టికెట్ల రద్దు, ప్రయాణ తేదీ మార్పు కోసం చార్జీలను ఒకసారి మినహాయిస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది. ఇండిగో విమాన సర్వీసుల రద్దుతో తమ కుటుంబం కూడా ఇబ్బందిపడిందని బాలీవుడ్ నటుడు సోనుసూద్ చెప్పారు. అయితే, "కొందరు ప్రయాణికులు విమానాశ్రయాల్లో ఇండిగో సిబ్బందిపై అరవడం, తిట్టడం కనిపించింది. ఇది బాధాకరం. ఈ అంశంలో సిబ్బంది కూడా నిస్సహాయులే. అందువల్ల మనం బాధ్యతాయుతమైన పౌరులుగా వారితో మర్యాదగా వ్యవహరించాలి" అని ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# త్వరలోనే విశాఖలో ఆధునిక సైక్లింగ్ ట్రాక్‌లు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం నగర అభివృద్ధిపై కీలక ప్రకటన చేశారు. నగరంలో త్వరలోనే ఆధునిక సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 'సివిక్ అప్పోజిషన్ ఆఫ్ ఇండియా' అనే సంస్థ ఎక్స్ వేదికగా చేసిన ఓ పోస్టుకు బదులిస్తూ సీఎం ఈ హామీ ఇచ్చారు. విశాఖ నగరంలో పాదచారులకు అనువుగా ఉన్న ఫుట్‌పాత్‌లు, ఆహ్లాదాన్ని పంచే పచ్చదనాన్ని ఆ సంస్థ ప్రశంసించింది. ఈ విషయంలో బెంగళూరు కంటే విశాఖ ఎంతో మెరుగ్గా ఉందని పేర్కొంది. సరైన వసతులు కల్పిస్తే దేశంలో తదుపరి ఐటీ హబ్‌గా ఎదిగే సత్తా విశాఖకు ఉందని అభిప్రాయపడింది. ఇదే స్ఫూర్తితో నగరంలో సైక్లింగ్ లేన్లను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను ట్యాగ్ చేస్తూ కోరింది. ఈ ట్వీట్‌పై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. "విశాఖలో నడకకు అనువైన ఫుట్‌పాత్‌లు, పెరిగిన పచ్చదనం నగరవాసులకు, పర్యాటకులకు మంచి అనుభూతిని పంచుతున్నందుకు సంతోషంగా ఉంది. నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉన్నాం. ఈ దిశగా త్వరలోనే సైక్లింగ్ ట్రాక్‌లను కూడా ప్రారంభిస్తాం" అని ఆయన తన సమాధానంలో పేర్కొన్నారు.

# కేసీఆర్ పోయి రేవంత్ వచ్చారంతే... అందులో మాత్రం మార్పేమీ లేదు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఎలాంటి తేడా లేదని, ఈ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ 'రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన' పేరుతో ఆదివారం మహా ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలపై ఒక చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని ఎలా దోచుకుందో చూశామని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ అదే జరుగుతోందని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ, ఇప్పుడు అప్పుల రాష్ట్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏం చేశారని 'ప్రజా పాలన' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. "కేసీఆర్ పోయి రేవంత్ రెడ్డి వచ్చారంతే.. పాలనలో, దోపిడీలో ఎలాంటి మార్పు లేదు" అని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదని సీఎంను నిలదీశారు. నిరుద్యోగ భృతి రూ.4 వేలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ వంటి హామీల గతి ఏమైందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

# గోవాలోని నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం..25 మంది మృతి

పనాజీ, డిసెంబరు 7: గోవాలోని ఓ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 25 మంది మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. ఉత్తర గోవాలోని అర్పోరా-నగావ్ గ్రామంలో అర్పోరా నది ఒడ్డున ఉన్న బిర్చ్ బై రోమియో లేన్ అనే నైట్‌క్లబ్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించి క్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. దీంతో మంటల్లో చిక్కుకుని కొందరు, దట్టమైన పొగకు ఊపిరాడక మరికొందరు మరణించారు. మృతుల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది క్లబ్ సిబ్బందిని గుర్తించారు. మరో 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. క్లబ్‌లో బాణసంచా పేలడంతో ఈ ప్రమాదం జరిగిందని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ప్రకటించారు. నిబంధనలు అతిక్రమించి, ఏమాత్రం భద్రతా చర్యలు తీసుకోకుండా క్లబ్‌ను నిర్వహించటమే ప్రమాదానికి కారణమని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో క్లబ్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లతోపాటు ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారన్న ఆరోపణలతో అర్పోరా-నగావ్ గ్రామ సర్పంచ్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, గోవా సీఎం ప్రమోద్ తదితరులు సంతాపం తెలిపారు.

గోవా రాజధాని పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అర్పోరా గ్రామంలోని బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్.. రాత్రి ఒంటిగంట సమయంలో క్లబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న డ్యాన్స్ హాల్‌లో ఉషారెక్కించే సంగీతం మారుమోగుతోంది.. దాదాపు వందమంది కేరింతలు కొడుతూ ఆనందంగా గడుపుతున్నారు. అప్పుడే వేదిక వెనుకవైపున పైకప్పు నుంచి చిన్నగా మంట మొదలై.. క్షణాల్లోనే హాలంతా మంటలు పాకాయి. క్లబ్‌లోనివారంతా ఒక్కసారిగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇరుకు దారిలో వెళ్లలేక కొందరు బేస్‌మెంట్‌లో ఉన్న వంటగదిలోకి వెళ్లారు. వారంతా ఊపిరాడక మరణించారని పోలీసులు తెలిపారు. రాత్రిపూట వేడుకలకు ఉత్తర గోవా ప్రాంతంలో బిర్చ్ క్లబ్ చాలా ప్రసిద్ధి. నిత్యం వందలాది మంది క్లబ్‌కు వస్తారు. అయితే, ఈ క్లబ్ నిర్మాణంలోగానీ, నిర్వహణలోగానీ ఏమాత్రం నిబంధనలు పాటించలేదని పోలీసుల విచారణలో తేలింది. లోపలికి వె ళ్లేందుకు, బయటకు వచ్చేందుకు దారులు చాలా ఇరుకుగా ఉన్నాయి. క్లబ్ భవనం జీవితకాలం ముగిసిపోవటంతో కూల్చివేయాలని గ్రామపంచాయతీ కార్యాలయం నోటీసులు కూడా ఇచ్చింది. అయినా క్లబ్‌ను నిర్వహిస్తున్నారు. అందులో పనిచేసే ఉద్యోగుల్లో చాలామంది అర్పోరా గ్రామ వాసులు ఉండగా, కొందరు జార?ండ్, అస్సాం రాష్ట్రాల వారు ఉన్నారు. మృతుల్లో కూడా వీరే అధికంగా ఉన్నారు. ప్రమాదంపై గోవా సీఎం ప్రమోద్ సావంత్ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50వేలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. మంటలు అంటుకోవటానికి ముందు క్లబ్‌లో భారీ పేలుడు సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో వంటగదిలో గ్యాస్ సిలిండర్ పేలి ఉండొచ్చని పోలీసులు మొదట భావించారు. అయితే, వంటగదిని పరిశీలించగా సిలిండర్లన్నీ సురక్షితంగా ఉన్నాయని గోవా డీజీపీ అలోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. పేలుడుపై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో క్లబ్ మొత్తం కాలిపోయింది. మంటలు క్షణాల్లోనే క్లబ్ మొత్తం వ్యాపించాయని పోలీసులు తెలిపారు. అగ్నిప్రమాద సమాచారం అందుకొని అగ్నిమాపక శకటాలు అక్కడికి వెళ్లినా.. దారి ఇరుకుగా ఉండటంతో క్లబ్‌కు 400 మీటర్ల దూరంలోనే ఆగిపోవాల్సి వచ్చిందన్నారు.

# కాంగ్రెస్ సర్పంచి అభ్యర్థి గంగారెడ్డి ఇంటింటి ప్రచారం..





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 7:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం లోని బోర్పట్ల గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి మామిడి గారి గంగరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి బ్యాటు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.అనంతరం గంగారెడ్డి మాట్లాడుతూ ఎంతో మందికి అవకాశం ఇచ్చారు ఒక్క సారి నాకు అవకాశం ఇవ్వండి అని ఓటర్లను అభ్యర్థించారు.సర్పంచిగా తనను గెలిపిస్తే గ్రామాన్ని అన్నివిధాల అభి వృద్ధి చేస్తా అన్నారు.గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, వీధి దీపాలు, సీసీ కెమెరాలు, ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి భాస్కర్ రెడ్డి,మాధవ రెడ్డి,మాజీ ఉప సర్పంచి చంద్రా రెడ్డి,మాజీ ఉప సర్పంచి కాసాల విఠల్,పి.గండయ్య,వెంకటేశం చారి,ఎరుకల ఆంజనేయులు,బక్కోల్ల నర్సింలు,శంకర్,కృష్ణ,నర్సింలు, రాజి రెడ్డి,కమలాకర్,అశోక్,కృష్ణ,నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ సర్పంచి అభ్యర్థి అమ్రాది వీణ జగదీష్ జోరుగా ప్రచారం..

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్07:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం లోని మేజర్ గ్రామపంచాయతీ దౌల్తాబాద్ సర్పంచి అభ్యర్థి అమ్రాది వీణ జగదీష్ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతి ఇంటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.ఒక్క సారి అవకాశం ఇచ్చి చూడండి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఓటర్లను అభ్యర్థించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక్క సారి అవకాశం ఇచ్చి సర్పంచిగా తనను గెలిపిస్తే దౌల్తాబాద్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా నన్నారు సర్పంచి గా గెలిపిస్తే గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, వీధి దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్రాది జగదీష్ తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## అభివృద్ధి చేశను మరోసారి అవకాశం ఇవ్వండి విజయలక్ష్మి వెంకటేశం..

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్07:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం లోని దౌల్తాబాద్ లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచి అభ్యర్థి కొన్యాల విజయలక్ష్మి వెంకటేశం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఎన్నో అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాలు తెచ్చామన్నారు.మరొక్క సారి సర్పంచిగా తన భార్యను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఓటర్లను అభ్యర్థించారు.తన భార్యను సర్పంచి గా గెలిపిస్తే గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, వీధి దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు,పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు,దౌల్తాబాద్ మాజీ సర్పంచి వెంకటేశం,దుర్గం గౌడ్,అజీజ్ హకీమ్, సోహెల్, శ్రీకాంత్, అరిగేసాయి తదితరులు పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ బలపర్చిన అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రచారం..





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్07:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం లోని దౌల్తాబాద్ గ్రామంలో ఆదివారం బి ఆర్ ఎస్ బలపర్చిన అభ్యర్థి వావిలాల సంగీత నర్సింలు కు మద్దతుగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ ఫుట్బాల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.వావిలాల నర్సింలు గత ఐదు సంవత్సరాల కాలో హత్నూర మండల పరిషత్ అధ్యక్షునిగా మండల ప్రజలకు మంచి సేవలందించారన్నారు.కావున ఫుట్బాల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిం చారు కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలు ఆలోచించి మంచి అభ్యర్థిని చూసి ఓటు వేయాలని ఆమె ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్షుడు తుమ్మల పల్లి కిషోర్, ఇబ్రాహీం, వీరేందర్, సాజిద్,సాయిలు, మల్లేశం,కృష్ణ, అజ్మత్ అలీ, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గా నరాల సత్యనారాయణ





**ఖమ్మం( సూర్య ప్రతినిధి ):** తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గా నరాల సత్యనారాయణ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పొలిటికల్ జేఏసీ రెండు తీర్మానాలు చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం రెండు వేల మందితో ఇందిరాపార్కు వద్ద ధర్నా మరియు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని 3500 మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయాలని తీర్మానించడం జరిగినది అని తెలియజేశారు. తెలంగాణ పొలిటికల్ జేఏసీ ప్రజా సమస్యలపై రాజీలేనిపోరాటం చేస్తుంది.ప్రజలే మా ధైర్యం ప్రజల కోసమే మా పోరాటం అనే నినాదంతో ఏర్పడినదే తెలంగాణ పొలిటికల్ జేఏసీ అని అన్నారు.వైస్ చైర్మన్ గా ధారావత్ గణేష్ నాయక్ వట్టం ఉపేందర్ అంగోతు రాంబాబు సెక్రటరీ జనరల్ గా బత్తుల సోమయ్య ప్రధాన కార్యదర్శిగా బానోతు హుస్సేన్ నాయక్ పూనెం శ్రీనివాస్ అధికార ప్రతినిధిగా తోడేటి శంకర్ గౌడ్ అనంతుల మధు రాష్ట్ర కార్యదర్శులుగా తుల్జా రెడ్డి పాలకుర్తి కృష్ణ సంగిశెట్టి క్రిస్టాఫర్ మహిళా కార్యదర్శిలుగా కంచర్ల మంజూష కందుకూరి శ్వేత సింగరాజు శ్యామల రాష్ట్ర కమిటీ సభ్యులుగా మాలోతు రామన్న నాయక్ తునికి పాటి చారి ఇస్లావత్ సంతోష్ నాయక్ కుక్క సత్యం గౌడ్ ను నియమించినట్లు తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ పేర్కొన్నారు.



## కొడవటూర్ సర్పంచ్ గా మిన్నలాపురం శ్యామల జలంధర్ రజక ముద్దుబిడ్డను గెలిపించుకొని అభివృద్ధి చేసుకుందాం ?గోపి రజక

### ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏదునూరి వీరన్న

### విద్యావంతులైన మిన్నలాపురం శ్యామల జలంధర్ గెలుపు అభివృద్ధికి మార్పు

### బ్యాట్ గుర్తుకే మన ఓటు

**బచ్చన్నపేట, డిసెంబర్ 07( ప్రభాత సూర్య ):** కొడవటూర్ గ్రామ అభివృద్ధి చేసుకోవాలంటే విద్యావంతులైన ఊరి సమస్యల పట్ల అవగాహన ఉన్న మిన్నలాపురం శ్యామల జలంధర్ ను గెలిపించుకొవాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక అన్నారు. జనగామ జిల్లా బచ్చన్నపేట్ మండలం కొడవలూరు గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏదునూరి వీరన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ అభ్యర్థి మిన్నలాపురం శ్యామలను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కొడవలూరు గ్రామ ప్రజలను కోరారు. మిన్నలాపురం శ్యామల జలంధర్ మాట్లాడుతూ మన గ్రామం అభివృద్ధి చెందాలంటే మిన్నలాపురం శ్యామల జలంధర్ (బ్యాట్ గుర్తు)అనే నన్ను గెలిపించుకుంటే వృద్దుల పింఛన్లు, రేషన్ కార్డులు,మహిళల కోసం స్వయం ఉపాధి శిక్షణలు ,యువత కోసం క్రీడా మైదానం, కంప్యూటర్ శిక్షణలు , ప్రతి వాడకు సీసీ రోడ్లు , రైతులకు డ్రిప్ స్ప్రింక్లర్ పై 90% సబ్సిడీ అవగాహన, ప్రభుత్వ పాఠశాలలను స్మార్ట్ క్లాస్ రూములుగా మార్చడం, గ్రామంలో నెలకు ఒక్కసారి హెల్త్ క్యాంపులు ,డిజిటలైజేషన్ గ్రామంగా మార్చడం, లైబ్రరీ ఏర్పాటు చేస్తామని సర్పంచ్ గా గెలిపిస్తే రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని వారన్నారు. ప్రచారంలో గ్రామ పెద్దలు, యువకులు , రాజకీయ నాయకులు రజక కులస్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సర్పంచి అభ్యర్థి అనంత రామ్ రెడ్డి జోరుగా ప్రచారం...





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 7 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం లోని బోర్పట్ల గ్రామంలో బి ఆర్ ఎస్ బలపర్చిన అభ్యర్థి అనంత రామ్ రెడ్డి ప్రచారం జోరుగా సాగుతుంది.ఆదివారం ఆయన బోర్పట్ల గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.ఒక్క సారి అవకాశం ఇస్తే గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మేజర్ గ్రామపంచాయతీ బోర్పట్ల సర్పంచిగా తనను గెలిపిస్తే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్ వీధి దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు,చేస్తామన్నారు.అదేవిధంగా గ్రామంలో 6నెలలకు ఒక సారి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచి అభ్యర్థి అనంత రాం రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు,మల్లేశం,పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి జినుకల జనార్ధన్ కాంగ్రెస్ లో చేరిక

**సంస్థాన్ నారాయణపూర్, డిసెంబర్ 07(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం మల్లారెడ్డిగూడెంలో బిజెపి బిఆర్ఎస్ ల నుండి కాంగ్రెస్ లోకి చేరికలు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి జనకల జనార్ధన్, వార్డ్ మెంబర్ సిరిపంగి పెద్దులు తో పాటు పలువురికి కాంగ్రెస్ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## బిఆర్ఎస్ హయాంలో నే గ్రామలలో అభివృద్ధి

### మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం ప్రచారం

**గట్టుప్పల.నవంబర్7. ప్రభాత సూర్య.:**గట్టుప్పల గ్రామంలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి అవ్వారి శ్రీనివాస్ ను గెలిపించాలని మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం కోరారు..వారికి మద్దత్తు గా పలు వార్డులో మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రచారం లో ప్రధాన అంశం గా గతంలో సర్పంచ్ గా ఉన్న నామని జగన్నాధం ఫార్మా కంపెనీకి అనుమతులు ఇచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి కి బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరారు .వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి గతంలో సర్పంచ్ గా ఉన్నపుడు డబ్బులు తీసుకుని ఫార్మా కంపెనీ కి అనుమతులు ఇచ్చారని మళ్ళీ గెలిపిస్తే ఫార్మా కంపెనీ పనులు పునప్రారంభం అవుతాయని యని అన్నారు. గతంలో గ్రామంలో బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్దే తప్ప కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనాలో ఒక్క అభివృద్ధి జరగలేదన్నారు.ప్రతి ఒక్కరు బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

## మాజీ జడ్పీటిసి కర్నాటి వెంకటేశంతో ఈఎల్వి ఫౌండేషన్ చెర్మెన్ బాస్కర్ భేటి

### స్థానిక రాజకీయ అంశలపై చర్చ



గట్టుపల్ నవంబర్.7 ప్రభాత సూర్య.గట్టుప్పల్ మండల కేంద్రంలో మాజీ జెడ్పిటిసి కర్నాటి నివాసంలో ఈఎల్వి ఫౌండేషన్ చైర్మన్ ఇరుగుదిండ్ల భాస్కరు మాజీ జెడ్పిటిసి తో ఆదివారం భేటీ అయ్యారు స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల దృశ్య ఇరువురి మధ్య రాజకీయ అంశంపై చర్చించారు గట్టుప్పల బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు ఈఎల్వి ఫౌండేషన్ పూర్తిగా మద్దతు ఇస్తుందని ఫౌండేషన్ చెర్మెన్ భాస్కర్ తెలిపారు.ఈ భేటీలో అభ్యర్థి అవ్వారి శ్రీనివాస్,మాజీ ఎంపిటిసి చేరుపల్లి బాస్కర్,ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ మాజీ సర్పంచ్ కర్నాటి అశోక్. బిఆర్ఎస్ నాయకులు తదితరులు.

## ఘనంగా కట్ల చంద్ర శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు, రక్త దాన శిభిరం ఏర్పాటు..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** చందానగర్ లో కాంగ్రెస్ పార్టీ యువ నేత కట్ల చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా నియోజక వర్గంలోని కార్యకర్తలు, నాయకులు , అభిమానుల మధ్య వేముకుంట గౌతమి నగర్ లోని శ్రీ శ్రీ శ్రీ మహాశక్తి లలితా పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి వారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ అయాజ్ అహ్మద్ ఖాన్ యువ డైనమిక్ నాయకుడు కట్ల చంద్ర శేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వారిని శాలువ తో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు నిర్వహించిన రక్త దాన శిభిరంలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో లతీఫ్ మొహమ్మద్ ఖాన్, హరికిషన్, అలీ అహ్మద్ ఖాన్, చంద్రమౌళి,మహమ్మద్ హనీఫ్, కామినేని వాసు తదితరులు పాల్గొన్నారు.





# ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

### రోడ్ ప్రమాదం లో తండ్రి, కూతురు మృతి.

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 7 :** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ సమీపంలో ఓఆర్ఆర్ పై ఎగ్జిట్-2 సమీపంలో శనివారం అర్ధరాత్రి లారీ కారును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు.ఒకే కారులో రెండు కుటుంబాలు భార్య, పిల్లలతో మేడ్చల్ నుండి తిరుపతి వెళ్తున్న శ్రీశైలం, తిరుపతి ఇరువురి కుటుంబ సభ్యులు. వీరంతా సమీప బంధువులు కలిసి ప్రయాణం చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో శ్రీశైలం(40), అతని కూతురు సుభిక్ష (4) అక్కడికి అక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎసై లక్ష్మా రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న బీడీఎల్ పోలీసులు.

## ధర్నాచౌక్ వద్ద బోయ మహాధర్నాకి బయలుదేరిన మియాపూర్ బిజెపి శ్రేణులు..


శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల ప్రజా వంచక పాలనపై నిరసనగా ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే బోయ మహా ధర్నా కార్యక్రమానికి మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలి వెళ్లిన బిజెపి పార్టీ శ్రేణులు. మియాపూర్ ఆర్ బి ఆర్ కాంప్లెక్స్ నండి బయలుదేరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాచమల్ల నాగేశ్వర్ గౌడ్ జిల్లా సెక్రెటరీ మాణిక్యరావు జిల్లా ఎస్సీ మోర్చా విజయేందర్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవేంద్రరావు ఆకుల మహేష్, గుండె గణేష్ ముదిరాజ్, శివారెడ్డి కుమారస్వామి, పారానంది నాగులు, పట్టాభిరామ్, రామకృష్ణారెడ్డి, రెడ్డమ్మ ప్రభాకర్, డి నాగేశ్వరరావు డి ప్రసాద్, చోటురామ్ అనిల్, మహేష్ యాదవ్ వెంకట్ , మియా పూర్ డివిజన్ ఉపాధ్యక్షులు అంజయ్య, కొంచెం శివరాజ్, మన్నె సురేష్, డివిజన్




ప్రధాన కార్యదర్శిలు జాజి రావు శీను , కోడెల ప్రసాద్, బీజేవైఎం అధ్యక్షులు ఆకుల మన్యం ఎస్సీ మోర్చా అధ్యక్షులు పత్తి బసవ శివ, మైనార్టీ అధ్యక్షుడు రూరా సింగ్ మహిళా అధ్యక్షురాలు మాధురి, డివిజన్ నాయకులు ముఖేష్ గౌడ్, డేవిడ్, ఏసుబాబు , అప్పారావు ప్రసన్న, జాజీరావు రాము, హరి, అభి, సోను రాహుల్, వినోద్, బబ్బులు, పవన్, సునీల్ ,రోహిత్ దుర్గ, వెంకట్, చందు, శక్తి కేంద్రం ఇన్చార్జులు, బూత్ అధ్యక్షులు సీనియర్ కార్యకర్తలు మొదలగున వారు పాల్గొనడం జరిగింది.

## గోపినగర్ జన చైతన్య ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ 69 వ వర్ధంతి కార్యక్రమం..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపినగర్ లో గోపినగర్ జన చైతన్య ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు బజార్ఘట్ రమేష్ ఆధ్వర్యంలో భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంను అంబేద్కర్ భవన్ లో ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ రచించకుంటే రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలు బడుగు, బలహీన వర్గాలకు అందేవి కావని గుర్తుచేశారు. రిజర్వేషన్లు కల్పించటంతో చాలా మంది విద్యా, రాజకీయాలు, వైద్యరంగంలో రాణిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. అంబేద్కర్ భవన్ నూతన కమిటి కీ అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసారు. భవనంను అన్ని వర్గాల ప్రజల అధికార



సమావేశాలకు, అభివృద్ధికి అనుగుణంగా కొనసాగించాలని సూచించారు. అసోసియేషన్ వారి అభ్యర్ధన మేరకు కార్పొరేటర్ తన సొంత ఖర్చులతో కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతానని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలుపమని వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంబేద్కర్ భవన్ గోపినగర్ బీసీ హాస్టల్ విద్యార్థులకు తన సొంత ఖర్చులతో స్పోర్ట్స్ కిట్స్ ను బహుమానంగా ప్రకటించారు. అంబేద్కర్ భవన్ నూతన కమిటి కీ అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమీషనర్ కోలా ప్రసాద్ , హైకోర్టు అడ్వకేట్ రాజేశ్వర్ రావు, బీసీ హాస్టల్ వార్డెన్ సమీర్, మాలాద్రి లు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన పుట్టుక నుండి మరణం వరకూ సమాజం లో ఉన్న అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే పనిచేశారు అంటూ స్ఫూర్తివంతమైన ఉపన్యాసాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జన చైతన్య ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ , జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, అడ్వైసర్ డాక్టర్. ముసలయ్య, వైస్ ప్రెసిడెంట్ రంగుల ప్రవీణ్, ట్రెజరర్ సందీప్ , వైస్ ప్రెసిడెంట్ పీ. ఆనంద్, జాయింట్ సెక్రెటరీ, పీ. ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ సాయినాథ్, సలహాదారులు వెంకటేష్ , నర్సింహా, తుకారాం, దస్తగిర్, ఎజాస్, యేసు, రాములు, దేవ ప్రసాద్, గండయ్య, ఎర్రోళ్ల నర్సింహా, ఎర్రోళ్ల ఆనంద్ , తలారి నర్సింలు , అరుణ్ రాజ్ కొండేటి ,జనచైతన్య అసోసియేషన్ మహిళా సభ్యురాళ్ళు , స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

## హాంక్ మోర్... వెయిట్ మోర్...

హైదరాబాద్, డిసెంబర్ : హైదరాబాద్‌లో ట్రాఫిక్ కూడళ్ల వద్ద హారన్ మోగింపుతో శబ్ద కాలుష్యం పెరుగుతోంది. ముంబై, బెంగళూరులో విజయవంతమైన 'హాంక్ మోర్.. వెయిట్ మోర్' విధానాన్ని హైదరాబాద్‌లోనూ అమలు చేస్తే శబ్ద కాలుష్యం గణనీయంగా తగ్గుతుందని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ఈ టెక్నాలజీ ఆధారిత పరిష్కారం ప్రజలలో మార్పు తెస్తుందని భావిస్తున్నారు.ముఖ్యంగా.. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలైన గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ప్యారడైజ్ సెంటర్లలో శబ్ద తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. కొన్ని సందర్భాల్లో ఈ ప్రాంతాల్లో శబ్ద తీవ్రత ఏకంగా 110 డెసిబుల్స్‌ను కూడా దాటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది దీర్ఘకాలంలో వినికిడి లోపం, ఒత్తిడి, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

ఈ నేపథ్యంలో, హారన్ మోగించడాన్ని నియంత్రించడం అత్యవసరం. శబ్ద కాలుష్యం అధికంగా ఉన్న నగరాల్లో ముంబయి ఒకటి. దీనిని నియంత్రించేందుకు, ముంబయి ట్రాఫిక్ విభాగం 2020లో వినూత్నమైన 'హాంక్ మోర్.. వెయిట్ మోర్' అనే విధానాన్ని అమలు చేసింది. ఈ పద్ధతి చాలా ఆసక్తికరంగా, ప్రభావవంతంగా ఉంది.ఈ విధానంలో ట్రాఫిక్ కూడళ్ల వద్ద ప్రత్యేక సౌండ్ సెన్సర్‌లను అమరుస్తారు. ఎరుపు సిగ్నల్ పడినప్పుడు, ఎవరైనా వాహనదారులు అనవసరంగా అధికంగా హారన్ మోగిస్తే, ఈ సెన్సర్‌లు ఆ శబ్దాన్ని గుర్తిస్తాయి. శబ్ద తీవ్రత నిర్ణీత పరిమితిని మించితే ఆటోమేటిక్‌గా రెడ్ సిగ్నల్ సమయం దానంతట అదే ఎక్కువ సెకన్లకు పెరుగుతుంది. శబ్ద తీవ్రత నియంత్రణలోకి వచ్చి తగ్గుముఖం పడితేనే గ్రీన్ సిగ్నల్ పడుతుంది. ఈ వినూత్న నిర్ణయం కారణంగా.. ముంబైలోని ఆయా కూడళ్లలో హారన్ మోగించడం ఏకంగా 60 శాతం మేర తగ్గింది. ఈ పద్ధతిని అమలు చేసిన తొలి నగరంగా ముంబై గుర్తింపు పొందింది.




# తెలంగాణ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

## సాయి ఈశ్వర్ చారికి ఖమ్మంలో ఘన నివాళులు

**ఖమ్మం( సూర్య ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడంలో విఫలమై నా బిజెపి కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల నాయకత్వం విఫలమైందని నా బీసీ ప్రజలకు తెలంగాణ రాష్ట్రంలో అన్యాయం జరిగిందని ఆవేదనతో కలత చెందిన ఈశ్వర చారి ఆత్మహత్య ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు నివాళిగా తెలంగాణ బీసీ జేఏసీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో పూలే ప్రాంగణం నుండి మయూరి సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి బీసీ జేఏసి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ పెరుగు వెంకటరమణ యాదవ్ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీసీ ఉద్యమ నాయకులు డాక్టర్ కేవి కృష్ణారావు మేకల సుగుణ రావు పిండిపోలు రామ్మూర్తి బిసి జేఏసీ బత్తిని మధు గౌడ్ నరేందర్ విద్యావంతుల వేదిక విజయ్ తెలంగాణ పీపుల్స్ జేఏసీ కాకి భాస్కర్ స్పర్శ అధ్యయన వేదిక బెజ్జంకి ప్రభాకర చారి టీఎన్జీవో నాయి బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు ఎలమందల జగదీష్ విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు వసంత బాబు తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు బచ్చల పద్మాచారి బద్రు నాయక్ నంగారా బేరి రాష్ట్ర నాయకులు దాసరి శ్రీనివాస్ మాల మహానాడు పాపారావు చారి కొరివి ధనలక్ష్మి బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు పోతురాజు రమాదేవి నాగేశ్వరరావు యాదవ్ పుల్లయ్య చారి రమేష్ యాదవ్ అనిల్ యాదవ్, చిన్నోజి పుల్లయ్య చారి మోతుకూరి వెంకటాచారి నరేష్ చారి దరిపల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. పూలే విగ్రహం దగ్గర అమరుడు సాయి విశ్వనాచారి మృతికి సంతాపాన్ని ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈశ్వర చారి స్ఫూర్తి తోటి మరో ఉద్యమాన్ని నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. 42% బీసీలకు రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో యువ నిరాకరించిన కాంగ్రెస్ బిజెపి పార్టీల అవకాశవాద వైఖరికి నిరసనగా ఈశ్వర చారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పటికైనా కాంగ్రెస్ బిజెపి పార్టీలు స్పందించి న్యాయబద్ధంగా ఆలోచన చేసి ఇప్పుడు జరుగుతున్నటువంటి శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టసభలలో బీసీ రిజర్వేషన్లు ప్రవేశపెట్టే బిల్లును ప్రవేశపెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# గ్రామాల్లో పొలిటికల్ హీట్...

హైదరాబాద్, డిసెంబర్ : సర్పంచ్ ఎన్నికల మూడో విడత నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. రాజకీయ పార్టీలు అన్ని పంచాయ తీల్లో తమ గెలుపు గుర్రాలను బరిలోకి దించాయి. ప్రధాన పార్టీలకు రెబల్స్ బెడద యథావిధిగా ఉంది. వీరే కాకుండా ఇండిపెండెంట్లుగా మరికొందరు పోటీలో నిలబడ్డారు. వీరితో నామినేషన్లను ఎలా ఉపసంహరింపజేయాలన్న దానిపై ముఖ్య అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. రెబల్స్కు, స్వతంత్ర అభ్యర్థులకు తాయిలాల ఆశ చూపేందుకు సిద్ధమయ్యారు. ఇక, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం అభ్యర్థులకు పెద్ద టాస్కా మారింది. ఓటర్లు దేనికి లొంగుతారో, వారిని ఎలా ప్రలోభాలకు గురిచేయా లన్న ఆలోచనలో మునిగిపోయారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మొత్తం 75 గ్రామ పంచాయతీలకు మూడో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం వంటి పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఓటరు మహాశయులను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు స్టార్ట్ చేశారు. ఇప్పటికే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. గెలుపే ధ్యేయంగా ర్యాలీలు తీస్తూ తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో చతుర్ముఖ పోటీ ఉండే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నం మండలంలో బీఆర్ఎస్, అబ్దుల్లాపూర్మెట్లో కాంగ్రెస్, మంచాల మండలంలో సీపీఎం, యాచారం మండలంలో బీజేపీ తమ సత్తా చాటాలనుకుంటున్నాయి.




సర్పంచ్ ఎన్నికల్లో పార్టీల సింబల్స్ ఉండనప్పటికీ... రాజకీయ వేడి మాత్రం ఖాయంగా ఉంది. ఆయా పార్టీలకు బలమైన పునాదులున్న గ్రామాల్లో విజయమే లక్ష్యంగా అభ్యర్థులను రంగంలోకి దించారు. ఆరుట్ల, పోల్కంపల్లి, రాయపోల్, తులేకలాన్, తులేఖుర్ద, మేడిపల్లి, నందివనపర్తి, లోయపల్లి, రంగాపూర్, జాపాల వంటి గ్రామాల్లో హోరాహోరీ పోరు ఉండనుంది. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్, మరికొన్ని గ్రామాల్లో బీజేపీ వర్సెస్ సీపీఎం మధ్య ప్రధాన పోటీ ఉండనుంది. ఇబ్రహీంపట్నం మండలంలో బీఆర్ఎస్, అబ్దుల్లాపూ ర్మెట్లో కాంగ్రెస్, మంచాల మండలంలో సీపీఎం, యాచారం మండలంలో బీజేపీ తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. సర్పంచ్ ఎన్నికల్లో మహిళలకే ప్రభుత్వం పెద్దపీట వేసింది. దాదాపు మెజార్టీ గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల విషయంలో మహిళలకే ప్రాధాన్యం దక్కింది. అన్ని పార్టీలు ఈసారి సింహభాగం యువతకే టికెట్లు కేటాయించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం వంటి పార్టీలు యువ రక్తానికే

# డీకేకు నోటీసులు

బెంగళూరు: నేషనల్ హెరాల్డ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్కు ఈవోడబ్ల్యూ నోటీసులు జారీ చేసింది. ఆర్థిక విషయాలు, లావాదేవీలపై శివకుమార్ వివరణ కోరుతూ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 19లోపు వివరాలు సమర్పించాలని ఈవోడబ్ల్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై దిల్లీ పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి జరిగిందని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు ఢిల్లీ పోలీసుల ఆధ్వర్యంలోని ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తో పాటు ఆయన సోదరుడు, ఎంపీ డీకే సురేష్లకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుల్లో యంగ్ ఇండియన్ సంస్థకు ఇచ్చిన రూ.2.5 కోట్ల విరాళాల వివరాలు, మూలం, ఆర్థిక లావాదేవీల డాక్యుమెంట్లు డిసెంబర్ 19లోపు సమర్పించాలని ఆదేశించింది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ అగ్ర నేతలు తమ పదవుల్ని దుర్వినియోగం చేశారనేది ఆ ఫిర్యాదు. ఈడీ ఇచ్చిన సమాచారంతో ఎఫ్ఐఆర్లో వారిపై నేరపూరిత కుట్ర సంబంధిత అభియోగాలు మోపారు. ఆ జాబితాలో మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దుబె, శాం పిట్రోడా కూడా ఉన్నారు. వీరందరూ కేవలం రూ.50 లక్షలు చెల్లించి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2వేల కోట్ల విలువైన ఆస్తులపై అధికారాన్ని పొందారని ఆరోపించింది. శివకుమార్కు పంపిన నోటీసుల్లో సంబంధిత డాక్యుమెంట్లు పంపినా, తమ ముందు వ్యక్తిగతంగా హాజరైనా..సరిపోతుందని అధికారులు పేర్కొన్నారు. ఆ నోటీసులలో ప్రధానంగా యంగ్ ఇండియన్కు ఇచ్చిన డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆ డబ్బు ఎందుకు ఇచ్చారు.. ఏ ఉద్దేశ్యంతో ఇచ్చారో చెప్పాలన్నారు. అందుకు డొనేషన్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, నేతలతో ఈ లావాదేవీపై ఏదైనా చర్చ జరిగిందా? ఆ డబ్బు ఎక్కడికి వెళ్లిందో చెప్పాలంటూ ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ పోలీసులు డీకే శివకుమార్కు ఇచ్చిన నోటీసుల్లో ప్రశ్నల వర్షం కురిపించారు. కాగా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లు యంగ్ ఇండియన్ సంస్థలో 38 శాతం చొప్పున షేర్లు కలిగి ఉన్నారని ఈడీ ఆరోపించింది. ఏజేఎల్కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.90.21 కోట్ల రుణాన్ని రూ.9.02 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చి.. ఆ షేర్లను రూ.50 లక్షలకు యంగ్ ఇండియన్కు బదిలీ చేశారని పేర్కొంది. తద్వారా రూ.2 వేల కోట్ల నుండి రూ.5 వేల కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులపై నియంత్రణ సాధించారని ఈడీ ఆరోపించింది. దీంతో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ సెక్షన్లు 3, 4, మరియు 70 కింద వారిపై ఛార్జిషీటు దాఖలు చేశారు. ఏప్రిల్ 11, 2025న ఈడీ ఢిల్లీ, ముంబై, లక్నోలలో రూ.661 కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులను సైతం ఆటాచ్ చేసిన విషయం తెలిసిందే.

# పంచాయితీ ఎన్నికల్లో మాజీ మంత్రి జగదీశ్వరరెడ్డి తండ్రి



నల్గొండ, డిసెంబర్ : తెలంగాణలో ఎక్కడ చూసినా గ్రామ సర్పంచ్ ఎన్నికల హడావిడి కనిపిస్తోంది.. సూర్యాపేట జిల్లా నాగారం గ్రామ పంచాయతీ జనరల్ రిజర్వ్ అయింది. ఈ గ్రామానికి చెందిన 95 ఏళ్ల గుంటకండ్ల రామ చంద్రారెడ్డి సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నారు. ఆయన ఎవరో కాదు.. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తండ్రి రామ చంద్రారెడ్డి. రాష్ట్రంలో అత్యధిక వయస్సు కలిగిన సర్పంచ్ పదవి అభ్యర్థిగా రికార్డులకు ఎక్కారు. యువత రాజకీయాల్లో ఆసక్తి చూపుతున్న సమయంలో.. తనకు వయసుతో సంబంధం లేదని, యువకుల కంటే ఎక్కువ ఉత్సాహంగా నేను పనిచేస్తానని 95 ఏళ్ల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.. వయస్సు అనేది జస్ట్ నెంబర్ మాత్రమేనని అంటున్నారు. ఆది నుంచి సామాజిక సేవ చేసే నేపథ్యం కలిగిన కుటుంబమని పేర్కొన్నారు. ఈ వయసులో కూడా చాలా చక్కగా, తన పని తాను చేసుకుంటూ ఉత్సాహంగా ఉన్నారు.. ప్రజా సేవ చేయాలనే తపన ఉందని.. అందుకే.. గ్రామాభివృద్ధి కోసం.. ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో తొలి ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రి భవనాలను రామచంద్రారెడ్డి కుటుంబీకులే నిర్మించారు. గ్రామస్తులతో రామచంద్రారెడ్డి. రైతుగా, టీచరుగా.. వైద్యుడిగా గ్రామస్తులతో మమేకమయ్యారు. అనేక సామాజిక సేవ కార్యక్రమాలను చేపట్టారు.. గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశం ఉన్నప్పటికీ%ొ% ప్రజాస్వామ్య స్ఫూర్తి నిలబెట్టేందుకు ఎన్నికలకు వెళ్తున్నానని రామచంద్రారెడ్డి చెబుతున్నారు.. సతీమణి సుశీల ఫౌండేషన్ తరపున గ్రామంలో అనేక కార్యక్రమాలను చేపట్టారని.. గ్రామాభివృద్ధిలో రామచంద్రారెడ్డి కీలక పాత్ర ఉందని, ఇక ఎన్నిక లాంఛనమేనని గ్రామస్తులు చెబుతున్నారు. తనకే లాంటి కుటుంబ బాధ్యతలు లేవని, సెంచరీ వయసుకు సమీపంలో ఉన్న తాను.. తన శేష జీవితాన్ని పూర్తిగా ప్రజాసేవకే అంకితం చేస్తానని ఈ 95 ఏళ్ల నవ యువకుడు.. రామచంద్రారెడ్డి చెప్పుకొచ్చారు.

# హైదరాబాద్లో ఆపరేషన్ కవచ్

తెలంగాణ రాజధాని హైదరాబాద్లో ఆదివారం నగరంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడానికి, నేరస్థులను అరికట్టడానికి హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ శనివారం5) రాత్రి 10:30 గంటల నుండి 'ఆపరేషన్ కవచ్'పేరుతో ఒక భారీ తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం హైదరాబాద్ పోలీసుల చరిత్రలో ఒక ప్రత్యేకమైనది, ఇందులో ఒకేసారి 5,000 మందికి పైగా పోలీసులను మోహరించారు, వీరు నగరంలోని 150 ముఖ్యమైన ప్రదేశాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ భారీ తనిఖీ కార్యక్రమానికి స్వయంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్ నాయకత్వం వహించారు. ఇందులో లా %డ% ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్తోపాటు సాయుధ రిజర్వ్, బ్లూ కోట్స్, పెట్రోలింగ్ బృందాలు కూడా పాల్గొన్నాయి. ఇది సమన్వయంతో కూడిన ప్రయత్నం, దీని లక్ష్యం నగరంలోని ప్రతి మూలలో భద్రతా వాతావరణాన్ని సృష్టించడం, అనుమానాస్పద కార్యకలాపాలను అరికట్టడం. ఈ కార్యక్రమం కింద, ప్రధాన కూడళ్లు, హోటళ్లు, లాడ్జీలు, బస్ స్టాప్లు, రైల్వే స్టేషన్లలో విస్తృతమైన తనిఖీలు చేశారు. పోలీసు బృందాలు ద్విచక్ర, ఫోర్ వీలర్స్ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయి., అనుమానితులను ప్రశ్నించారు. వారి పత్రాలను పరిశీలించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు లేదా తప్పుడు పత్రాలతో తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించేవారిపై ప్రత్యేక దృష్టి సారించారు.

# భారత్ ఐటీ నిపుణుల్లో టెన్షన్

అమెరికాలో హెచ్-1బీ (ఎ-1దీ) వీసాల వినియోగంపై మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అగ్రశ్రేణి టెక్ కంపెనీలు స్థానిక అమెరికన్ ఉద్యోగులను తొలగిస్తూ, అదే సమయంలో వేల సంఖ్యలో విదేశీ నిపుణులను నియమించుకోవడంపై సీనియర్ సెనేటర్ రూబెన్ గాలెగో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని ఆయన ట్రంప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామం హెచ్-1బీ వీసాలపై ఎక్కువగా ఆధారపడే భారతీయ టెక్ నిపుణులపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ మేరకు కార్మిక శాఖ కార్యదర్శి, యూఎస్సీఐఎస్ డైరెక్టర్, అటార్నీ జనరల్కు రాసిన లేఖలో గాలెగో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. "అమెరికా ఆర్థిక వ్యవస్థ వృద్ధికి నైపుణ్యం కలిగిన




వలసదారులు అవసరమే. కానీ, ఆ కార్యక్రమాలు అమెరికన్ ఉద్యోగులను తొలగించడానికి లేదా వారి స్థానాన్ని భర్తీ చేయడానికి ఒక మార్గంగా మారకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. కొన్ని పెద్ద టెక్ కంపెనీలు లక్షలాది మంది స్థానిక ఉద్యోగులను తొలగించాయని, అదే సమయంలో 2025 ఆర్థిక సంవత్సరంలో 30,000 మందికి పైగా విదేశీ నిపుణులకు హెచ్-1బీ వీసాలు పొందాయని ఆయన ఆరోపించారు. ఈ కంపెనీల లో యువ అమెరికన్ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని గాలెగో గణాంకాలతో సహా వివరించారు. 2023 జనవరిలో 21-25 ఏళ్ల మధ్య వయసున్న ఉద్యోగుల వాటా 15 శాతం ఉండగా, 2025 జులై నాటికి అది 6.7 శాతానికి పడిపోయిందని తెలిపారు. ఒకవైపు అమెరికన్ యువతకు ఉద్యోగాలు దొరక్క ఇబ్బంది పడుతుంటే, కంపెనీలు విదేశీ నియామకాలకు ప్రాధాన్యత ఇవ్వడంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. హెచ్-1బీ వీసాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రారంభించిన 'ప్రాజెక్ట్ ఫైర్వాల్' అమలు తీరుపై ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. ఈ పరిణామాలను భారత ఐటీ పరిశ్రమ నిశితంగా గమనిస్తోంది. అమెరికాలో హెచ్-1బీ వీసాలు పొందుతున్న వారిలో భారతీయులే అత్యధికం. ఒకవేళ అక్కడి ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తే, అమెరికాలో ఉద్యోగాలు ఆశిస్తున్న వేలాది మంది భారతీయ ఇంజనీర్లు, ఐటీ నిపుణుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.